www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 25 నవంబర్ 2025
5
అన్నమయ్య

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

నియోజకవర్గంలోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని రవాణా, క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మదనపల్లె రోడ్డులోని ఎజి గార్డెన్ ప్రజలకు శాశ్వత తాగునీటి బోర్ ను టిడిపి నాయకులు మడితాటి శ్రీనివాసులురెడ్డితో కలిసి నూతన మోటార్ బిగించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జెజిగ్రాన్ ప్రజలు నీటి సమస్యతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారిని పట్టణ ప్రజల కోరిక మేరకు గ్రామంలో నూతన బోరు వేసి మోటార్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో నీటి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమం ముఖ్యులు నాటారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు రాంప్రసాద్‌రెడ్డిని గజమాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో రాయుడు కాలనీ టిడిపి నాయకుడు రంజిత్ రాయల్, టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజంపేట

విఆర్‌ఎల సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన విఆర్‌ఎ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సి.హెచ్ చంద్రశేఖర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 19500 మంది విఆర్‌ఎలు గౌరవ వేతనంతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో వేతనాలు పెంచుతామని ఒక్క రూపాయి కూడా పెంచకపోగా, పోరాడి సాధించుకున్న డిఎ రూ.300 కూడా రికవరీ చేసిందన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలైనా వేతనాలు గాని, సమస్యలు గాని పరిష్కరించకపోగా అదనపు పనులు చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. తమకు వచ్చే రూ.10,500తో పెట్రోలు, భోజనాలకు ఖర్చు చేసుకోవాల్సి వస్తుందన్నారు. అక్రమ డ్యూటీలు, నైట్‌వాచ్‌మెన్, అటెండర్, డ్రైవింగ్, పనులను విఆర్‌ఎలతో చేయించు కుంటు న్నారన్నారు. తెలంగాణ మాదిరి పే స్కేల్ అమలు చేయాలని, ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎ ప్రమోషన్ల కోసం 20శాతం ఉన్న కోటాను 70శాతానికి పెంచాలని కోరారు. మదనపల్లిలో విఆర్‌ఎలకు ప్రమోషన్లు ఇచ్చారని, రాజంపేట డివిజన్‌లో కూడా ప్రమోషన్లు ఇవ్వాలని గతంలో సబ్ కలెక్టర్ ఇచ్చిన హామీ ఇంకా అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని కోరారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ హెచ్.ఎస్ భావనకు వినతిపత్రం అందజే శారు. అనంతరం సబ్ కలెక్టర్ గతంలో విఆర్‌ఎలు ధర్నా చేసిన సందర్భంగా అప్పుడు వారి ఫిర్యాదు మేరకు మదనపల్లె నుంచి ప్రమోషన్లు ఇచ్చిన జిఒ తెప్పించుకున్నానని, ఉమ్మడి జిల్లా కడప జిల్లా కలెక్టర్‌కు రిపోర్టు పంపినట్లు తెలిపారు. తిరిగి మరల రిపోర్ట్ చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. మిగత సమస్యలను ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని చెప్పారని అన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఎ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోరముట్ల సుధాకర్, డివిజన్ కార్యదర్శి మధు ,మల్లి, బి.సుబ్బ రాయుడు, చక్రపాణి, తిరుపాల్, నరసింహులు, పెంచలయ్య, రెడ్డిపల్లి శివయ్య , వెంకటయ్య రత్నమ్మ , హరీష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.వి రమణ , యానిమేటర్ల జిల్లా సహాయ కార్యదర్శిపాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

నకిలీ మద్యం కేసులో

కస్టడీకి ఐదుగురు నిందితులు

- విచారిస్తున్న సిట్, ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

నకిలీ మద్యం తయారు కేసులో ఐదుగురు నిందితులను సోమవారం ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారు కేసులో నిందితులు అష్రఫ్, బాలాజీ, సుదర్శన్, చైతన్య బాబు, శ్రీనివాసరావును పోలీస్ కస్టడీ తీసుకొని విచారణ చేపడుతున్నారు. తొలిత నిందితులను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు, సిట్ అధికారుల ఆధ్వర్యంలో నిందితులను విచారిస్తున్నారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారు కేసు రాష్ట్రంలో సంచలనం లేపిన విషయం తెలిసిందే. పోలీసుల విచారణలో మద్యం తయారీ కేంద్రంలో పోలీసులకు లభించిన డైరీ, సెల్ఫోన్ కాల్ డేటా, నకిలీ మద్యం క్రయవిక్రయదారుల సంబంధించి వివరాల మేరకు 36 మంది నిందితులు ఉన్నట్టు గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. వారిలో ఇప్పటికే 20 మందిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు, మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. ఈ కేసును సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. బెల్టు షాప్‌ల కు సరఫరా చేసిన వివరాలు, ప్రధాన నిందితుడు జనార్ధన్ రావు, తంబళ్లపల్లి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి దాసరపల్లి జయచంద్రారెడ్డితో ఉన్న ఆర్థిక లావాదేవీలు, పలు కీలక విషయాలపై పోలీసులు నిందితులను విచారించినట్లు తెలిసింది.

నకిలీ మద్యం కేసు నిందితులను కస్టడీకి తీసుకుంటున్న పోలీసులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

- అవినీతి ఆరోపణలపై విచారణ
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిఐజి రామలక్ష్మి పట్నాయక్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ రాష్ట్ర కమిషనర్, ఐజి ఆదేశాల మేరకు బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం కడప డిఐజి రామలక్ష్మి పట్నాయక్ విచారణ చేపట్టారు.ప్రజల వద్ద నుండి అధిక మొత్తంలో డాక్యుమెంట్ రైటర్లు 1శాతం డబ్బులు వసూలు చేస్తున్నారని, స్టాంపులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని వచ్చిన ఫిర్యాదులు వాస్తవమేనని డిఐజి తెలిపారు.అధిక ధరలకు స్టాంపుల విక్రయాలు చేస్తున్న నలుగురు స్టాంప్ వెండర్లను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వస్తున్న ప్రజలపై సబ్ రిజిస్టర్ వెంకటేశ్వర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని డిఐజి ప్రజలు ఫిర్యాదు చేశారు.ప్రజలు మధ్యవర్తుల ద్వారా కాకుండా ఐజిఆర్ఎస్ పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని డిఐజి సూచించారు.సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ప్రయివేట్ వ్యక్తులు ఎవరు విధులు నిర్వహి ంచకూడదని, కేవలం సిబ్బంది ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసా గించాలని ప్రజలకు సూచించారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పెద్ద ఎత్తున జరిగిన అవినీతిపై అధికారులు స్పందించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న డిఐజి రామలక్ష్మి పట్నాయక్

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి : కలెక్టర్

అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తి అవగాహనతో ఉండాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, జిఎస్‌డబ్ల్యూఎస్ లక్ష్మీపతి, సర్వే, ఎడి భరత్‌కుమార్ ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. అర్జీలను నాణ్యతగా పరిష్కరించాల న్నారు. ముఖ్యమంత్రి పిజిఆర్ఎస్ అర్జీలకు సంబంధించి ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్నారన్నారు. జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆయా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీ దారులతో నేరుగా మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాలను ,గ్రామాలను పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు.జిల్లా లో డిసెంబర్ 3 వరకు వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున రైతులకు, ప్రజలకు అప్రమత్తం చేసి ఇలాంటి ప్రాణ, పంట నష్టం జరగకుండా చూడాలని వారికి ఎప్పటిక ప్పుడు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో విఫలమైందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. సోమవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. దీంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో పంటలు సాగు బాగా తగ్గిందని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో అయితే పది నుంచి 15 శాతం మాత్రమే పంటల సాగైందని పేర్కొన్నారు. ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. ఎన్నికల సమయంలో రైతు భరోసా పథకం కింద కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం 20,000 అందిస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చి తప్పడం దారుణం అన్నారు. రాయచోటి పట్టణంలో రోజురోజుకూ అక్రమాలు, దౌర్జన్యాలు పెరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ఎక్కడ ఖాళీ స్థలాలు కనపడినా అక్కడే దౌర్జన్యం, కబ్జాలు, ఆక్రమణలు జరుగుతుంటే అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో డిప్యూటీ తహశీల్దార్‌ను ఇన్‌ఛార్జిగా నియమించడం, భూరికార్డులను తారు మారు చేయడం తదితరాలు అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు, మిలిటరీ పట్టాను సైతం కబ్జాలకు గురవుతున్నాయన్నారు. పట్టణంలో గ్యాంగులు, గంజాయి బ్యాచ్ లు, అల్లరి మూకలు పెరిగిపోయి షెడ్లు ధ్వంసం చేయడం, భూములను ఆక్రమించడం, దళితులను భయభ్రాంతులకు గురిచేయడం లాంటి ఘటనలు పెరుగు తున్నా యన్నారు. అక్రమ కూల్చివేతలు, దౌర్జన్యాలు వెనుక అధికారులే మద్దతుగా నిలుస్తుండడాన్ని ఆయన వ్యతిరేకించారు. భూవివాదాల వస్తే రికార్డులు పరిశీలించి అధికారుల సమక్షంలోనే నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. అన్ని సక్రమంగా ఉన్నా పంచాయితీలు పెడతాము అంటూ ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధితులపై ఒత్తిడి తీసుకురావడం అన్యాయమన్నారు. పోలీసులు అధికారులు అధికార పక్షానికి కాకుండా ప్రజల పక్షాన, న్యాయం పక్షాన నిలబడాలంటూ కోరారు. కలెక్టర్ జెసి, డిఆర్ఒ భద్రత చర్యలు తీసుకోని పట్టణంలో జరుగుతున్న ఆక్రమాలకు చెక్ పెట్టాలంటూ డిమాండ్ చేశారు. డిఆర్ఒ వ్యవహారంపై కూడా అనేక ఆరోపణలు వస్తున్నాయన్నారు. భవనాల కూల్చివేతల నుంచి భూ రికార్డుల మార్పుల వరకు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడం తీవ్ర సమస్యలకు దారితీస్తుందంటూ ఆయన హెచ్చరించారు. వ్యవస్థలను వ్యక్తిగత ఆదాయాల కోసం దుర్వినియోగం చేయడం ఆపాలన్నారు. పాత రికార్డులను తారుమారు చేస్తూ అక్ర మాలకు పాల్పడే అధికారులు రాబోయే రోజుల్లో తప్పించుకోలేరంటూ ఆయన హెచ్చరించా రు. సమావేశంలో వైసిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ఉద్యోగులను ఆప్కాస్‌లోనే కొనసాగించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి-కలికిరి

జెఎన్‌టియులో పని చేస్తున్న ఉద్యోగులను ఆప్కాస్‌లో కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జెఎన్‌టియు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ యం.వెంకటేశ్వరావుకు అందించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలికిరి జెఎన్‌టియులో ఆప్కాస్‌లో పనిచేస్తున్న వర్కర్స్ పట్ల యాజమాన్యం దంద్వ వైఖరి వి జె యన్ టీయులో వారికి సకాలంలో వేతనాలు రాలేదన్నారు. ఉద్దేశ్యం పూర్వకంగానే ఆప్కాస్ రద్దు చేశారన్నారు. నేడు ఏజెన్సీకి కట్టుబెట్టినా 17,18 తేదీల్లో కూడా వేతనం రాలేదని తెలిపారు. ఇఎస్ఐ, పిఎఫ్ పేరుతో వేతనాల్లో కోతలు విధించడం, వాటిని పిఎఫ్ ఖాతాలోళ జమ చేయకపోవడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. గత నాలుగు నెలల ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు అకౌంట్‌లో జమ చేయాలన్నారు. ఏజెన్సీల నుంచి ఆప్కాస్‌లో చేర్చే వరకు ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమం లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు రియాజ్, ఇన్ను, సంధ్య, రవి, ఖాదర్, రమణ,షాహినా, ఎస్టర్, ఆనంద్ బాబు, యోగేష్ కుమార్, విజయ్ పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌కు వినతిపత్రం ఇస్తున్న రామానుజులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కనీస అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడమే లక్ష్యం

యాప్ సర్వేను పరిశీలిస్తున్న డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థుల్లో అభ్యసన సామర్ధ్యాలను మెరుగుపరచడానికి ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి బేస్ లైన్ సర్వేను చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాలోని 3689 ప్రాథమిక పాఠశాలల్లో 1,11, 587 మంది విద్యార్థులకు అమలవుతున్న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసిపై బేస్ లైన్ సర్వే లీప్(లర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్) యాప్ ద్వారా సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో డైట్ విద్యార్థులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ పాల్గొంటున్నారన్నారు. ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ సర్వే ద్వారా పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయిలలో సమగ్ర డేటా సేకరిస్తారని చెప్పారు. దీని ద్వారా ఏ విద్యార్థి ఏ నైపుణ్యంలో బలహీనత కలిగి ఉన్నాడో, ఏ పాఠశాలలో వెనుకబడిన వారుసంఖ్య ఎక్కువగాఉందో, ఏ టీచర్లకు శిక్షణ అవసరమో ప్రభుత్వం కచ్చితంగా గుర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ సమాచారం ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా రీమిడియల్ బోధన, ప్రత్యేక శిక్షణలు విద్యా నాణ్యత మెరుగుదల చర్యలు అమలు చేస్తారన్నారు. అనంతరం డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అబ్బవరం దళితవాడ ప్రాథమిక పాఠశాలలో సర్వే జరుగుతున్న తీరును పరిశీలించి తగు సూచనలు చేశామన్నారు. ఈ కార్యక్రమం అంతిమ లక్ష్యం రాష్ట్రంలోని ప్రతి 1-5 తరగతి విద్యార్థి పాఠ్యపుస్తకాన్ని సులభంగా చదవగలగడం, గణితంలో ప్రాథమిక లెక్కలు చేయగలగడం, తద్వారా 6వ తరగతి నుంచి ఉన్నత తరగతుల్లో విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుకు సాగేలా చేయడమేనన్నారు. కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయిని సాగరిక, సిఆర్‌పి విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణను అడ్డుకోవాలి

-యానాదుల సంక్షేమ సంఘం

ప్రజాశక్తి-రాజంపేట

శ్మశానానికి వెళ్లే రహదారిని ఆక్రమణదారుల నుంచి రక్షించాలని యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెలుగు సుధాకర్ కోరారు. పెనగలూరు మండల పరిధిలోని నాయుడువారిపల్లె యానాది కాలనీ వాసులు సోమవారం రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్ భావనను కలిసి రహదారి ఆక్రమణను అడ్డుకొని తమకు న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెలుగు సుధాకర్ మాట్లాడుతూ రెండు శతాబ్దాలుగా 80 కుటుంబాల గిరిజనులు ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోరంబోకు స్థలంలో రాకపోకలు సాగిస్తూ గొర్రెలు, మేకలు, పశువులు మేపుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవారమన్నారు. శ్మశానానికి కూడా ఏకైక ప్రధాన రహదారి అదే కావడంతో తమకు ఆ దారే ఏకైక దిక్కు అని, కొందరు అగ్రవర్ణాల వారు రాజకీయ అండతో ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఆక్రమణను అడ్డుకొని నిరుపేదలైన గిరిజనులకు ఆ స్థలాన్ని కేటాయించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీలం అంకమ్మ, మహిళా ఉపాధ్యక్షురాలు కానూరు రుక్మిణమ్మ, జిల్లా నాయకులు గాలి ఆనంద్, తిక్కరపు లోకేశ్వర్, వెంకటయ్య, సుబ్బనరసయ్య, నిమ్మల నరసింహులు, జయరామయ్య, కన్నయ్య, యాటగిరి నరసింహులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న గిరిజనులు

ఆపరేషన్ కగార్ ఆపి చర్చలు జరపాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న కూంబింగ్ ఆపేస్తే, తాము కూడా మార్చి 31 వరకూ కాల్పుల విరమణ పాటిస్తామని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ విడుదల చేసిన లేఖపై ఛత్తిష్ గడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు సానుకూలంగా స్పందించి, స్వాగతించాలని విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ పేర్కొన్నారు. అత్యంత క్రూరమైన విదేశీ ఉగ్రవాదుల విషయంలో కూడా అనేక సందర్భాల్లో చర్చలకు అవకాశం ఇచ్చి, కాల్పుల విరమణ పాటించిన ప్రభుత్వం, మధ్య భారత అడవుల్లో నిక్షిప్తమై ఉన్న అపారమైన సహజ వనరుల పరిరక్షణ కోసం, పేదరికం, వివక్ష, అసమానతలు, దోపిడీ, దౌర్జన్యాలు లేని సమసమాజం కోసం పోరాడుతున్న, స్వదేశీ బిడ్డలతో చర్చలు జరుపడానికి విముఖత వ్యక్తం చేస్తూ, మావోయిస్టుల నిర్మూలనకు డెడ్ లైన్ విధించడం న్యాయబద్దంగా లేదన్నారు. ప్రభుత్వంతో చర్చలకు తాము సిద్దమని, చాలా కాలంగా మావోయిస్టులు ప్రకటిస్తున్నా పట్టించుకోకుండా, ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న నరమేధంలో అటు మావోయిస్టుల్లోనూ, ఇటు పోలీసుల్లోనూ అధిక సంఖ్యలో ప్రాణ నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

డయల్ యువర్ సిఎండికి 65 వినతులు

- ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప : విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 65 వినతులు అందినట్లు ఆ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎం కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంద్వారా 65 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను తెలియజేశారని, వాటిలో కర్నూలు సర్కిల్ నుంచి 17, తిరుపతి నుంచి 12, నెల్లూరు నుంచి 9, అనంతపురం నుంచి 7, కడప నుంచి 5, అన్నమయ్య నుంచి 5, నంద్యాల నుంచి 5, చిత్తూరు నుంచి 3. శ్రీసత్యసాయి సర్కిల్ నుంచి 2 వినతులున్నాయని వివరించారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

వైద్యుల సలహాల మేరకే యాంటీబయాటిక్స్ వాడాలి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ : యాంటీబయాటిక్ మందులను వైద్యుల సలహాలు సూచనల మేరకే వినియోగించాలని రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మి ప్రసాద్, వైద్యుడు బండారు కిరణ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ వైద్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక అర్చన విద్యా సంస్థలలో బిఎస్‌సి నర్సింగ్, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, ఫిజియోథెరపీ విద్యార్థులకు యాంటీబయాటిక్స్ నిరోధకత అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యాంటీబయోటెక్ మందుల విని యోగం వల్ల కలిగే లాభాలతో పాటు దుష్ప్రభావాలను గురించి కూడా వివరి ంచారు. ప్రజలు, విద్యార్థులు, వైద్యులు ఎఎంఆర్‌పై తప్పక అవగాహన కల్పిం చుకోవాలంటూ సూచించారు. భవిష్యత్తు తరాలకు సురక్షితమైన, సమర్థవంత మైన వైద్య చికిత్స అందించడం కోసం అవగాహన సదస్సులు కీలకమన్నారు. యాంటీబయాటిక్స్ వాడకంలో జాగ్రత్తగా ఉండాలని, అవసరమైనప్పుడు మాత్రమే వైద్య సలహా మేరకు మందులు వాడాలని సూచించారు

మాట్లాడుతున్న సూపరింటెండెంట్ లక్ష్మీ ప్రసాద్

బిసిలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను అమలు చేయాలని జిల్లా బిసి సంక్షేమ సంఘం నాయకుల కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వారు కలెక్టర్‌తో మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపనున్నట్లు సంకేతాలు అందుతున్నాయని పేర్కొన్నారు. బిసిల రిజర్వేషన్ల శాతం ఖరారు చేయకుండానే ఎన్నికల నిర్వహిస్తే జనాభాలో 56శాతం గల బిసిలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. జనాభా దామాషా ప్రకారం బిసిలకు రిజర్వేషన్ల శాతం నిర్ణయిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో జనగణనతో పాటు కులగణన కూడా జరపాలన్నారు. రాజ్యాంగ చట్టం ప్రకారం బిసిలకు కల్పించాలని, ఎబిసిడిగా విభజించాలి, మహిళల రిజర్వే షన్లను పరిశీలించాలన్నారు. ప్రభుత్వం తక్షణమే బిసిల రక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ సంఘం కార్యదర్శి ఖాజావలి, వర్కింగ్ ప్రెసిడెంట్, గౌరవాధ్యక్షుడు కే.వి.రమణ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్నబిసి సంఘ నేతలు

సచివాలయానికి తాళాలు వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కాట్నగల్లు సచివాలయానికి తాళాలు

-సర్పంచ్ నిధులు గోల్‌మాల్ చేశారని గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటిఎం మండలంలోని కాట్నగల్లు సచివాలయంలోని పంచాయతీ నిధులు ఆ గ్రామ సర్పంచ్ పనులు చేపట్టకుండా నిధులు గోల్‌మాల్ చేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం సచివాలయానికి తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిన్న కాలంలో పంచాయతీకి రూ.10లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. పంచాయతీలో కనీసం వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయకుండా బిల్లులు డ్రా చేసుకుని మిన్నకుండిపోయారన్నారు. వాటర్‌మేన్‌లకు 9నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. హరిత కార్మికులకు కూడా జీతాలు ఇవ్వకుండా నిలపేశారన్నారు. వారి పేరిట సమాచార హక్కు చట్టంలో వివరాలు సేకరిస్తే వారిపేరిట డబ్బులు డ్రా అయినట్లు వివరాలు అందించారని, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి గుట్టుచప్పుడు కాకుండా బిల్లులు డ్రా చేసుకుని ఉండిపోయారన్నారు. వాటర్‌మేన్‌లకు జీతం రాకపోవడంతో స్టార్టర్ పెట్టును తీసుకెళ్లడంతో గామంలో నీటి సమస్య ఏర్పడిందన్నారు. గ్రామంలో ఉపాధి పనులకు పంచాయతీ తీర్మాణాలు లేక బిల్లులు అగిపోయాయన్నారు. ఎవరి వద్ద వెళ్లి సమాచారం అడిగిన పంచాయతీ తీర్మాణాలు కావాలి అంటున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా సర్పంచ్ స్థానికంగా లేకపోవడంతో పాటు గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులకు సహకరించడం లేదంటూ పేర్కొన్నారు విషయం తెలుసు కున్న డిప్యూటీ ఎంపిడిఒ సచివాలయం వద్దకు చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు. పిడిఒ చర్చించి సమస్య పరిష్కరిస్తామన్నారున తమ సమస్య పరిష్కారం అయ్యే వరకు కార్యాలయానికి తాళాలు తీసేదిలేదన్నారు. డపిఒ ఫోన్ ద్వారా మాట్లాడుతూ ప్రత్యేక అధికారిని నియ మించి పంచాయతీలో జరిగిన నిధులు దుర్వినియోగంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో గ్రామస్తులు సచివాలయంకు తాళాలు తీశారు.

28న రామాపురం మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-రామాపురం : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 28న ఉదయం 11 గంట లకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో మండల అధ్యక్షులు గడికోట విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జాషు వా తెలి పారు. ఈ సమావేశంలో మండలంలో చేపట్టిన పలు రకాల అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానం చేస్తారన్నారు. జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల అధికారులు,సచివాలయ కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

28న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-రాయచోటి : ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని రాజంపేట ప్రభుత్వ ఎస్‌టి ఆశ్రమం స్కూల్‌లో ఈనెల 28న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగమేళలో డాక్టర్ రెడ్డీస్ గ్రో వి, ఫోన్ పే, ముత్తూట్ ఫైనాన్స్, చాతుర్య సిల్క్స్, టివిఎస్ మోటార్ లిమిటెడ్, యంగ్ ఇండియా, అపోలో, శ్రీరామ్ ఇన్సూరెన్స్, అమరరాజా, తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని ఆసక్తి, ఉన్నటువంటి యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు https://naipunyam.ap.gov.in/user-registrationలింకులో రిజిస్ట్రేషన్ చేసుకోవా లన్నారు. మరిన్ని వివరములకు 9603770097, 9502527277 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీ గంగాపురంలో త్రాగునీటి బోరు చెడిపోగా మా ఊరు ప్రజలు సర్పంచ్ నాగార్జునచారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి తాగునీటి బోరు సొంత నిధులతో మరమ్మతులు చేయించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలి

ప్రజాశక్తి-చిన్నమండెం : మండలంలోని బలిజపల్లెలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. రైతులకు జీవామృతం ఎలా తయారు చేయాలి, ఎలా వినియోగించుకోవాలనే వాటిపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.ఆదినారాయణ, మండల వ్యవసాయ అధికారి గీత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-వీరబల్లి : మండలంలోని వంగిమళ్ల పంచాయతీ ఉప్పరపల్లి గ్రామంలో జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం కోసం మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. సుమారు 200మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో మరుగుదొడ్ల అవసరం దృష్ట్యా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న నిర్మాణ పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రసాద్ సోమవారం భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఇ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు, శుభ్రత కోసం మరుగుదొడ్లు అత్యంత కీలకమని, నాణ్యమైన పనులు చేసి త్వరితగతిన పూర్తి చేసి అందిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల మహిళా అధ్యక్షులు నాగసుబ్బమ్మ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : జనసేన పార్టీ కార్యకర్తలకు, జన సైనికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు ప్రదీప్‌సింగ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం మంగళగిరిలో ఎమ్మెల్సీ నాగబాబు ఆధ్వర్యంలో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ క్రియా ఇన్సూరెన్స్ చెక్కులను ప్రదానం చేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 220మంది కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారన్నారు. మండల పరిధిలోని తవళం పంచాయతీ చౌకిల్లవారిపల్లెకు చెందిన జనసేన కార్యకర్త గుమ్మడి శివ 2024 సెప్టెంబర్‌లో మదనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్నారు. గుమ్మడి శివ కుటుంబానికి జనసేన పార్టీ మదనపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు తోట కల్యాణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నాగబాబు రూ.5 లక్షల క్రియా ఇన్సూరెన్స్ చెక్కును మృతుడి భార్య జ్యోతి కి అందజేసినట్లు పేర్కొన్నారు. **రాజంపేట :** పార్టీకి కార్యకర్తలే వెన్నెముకని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త అతికారికృష్ణ తెలిపారు. పార్టీలో క్రియా శీలకంగా ఉంటూ ప్రమాదవశాత్తు మృతి చెందిన జనసైనికులు, వీరమహిళలకు నాగబాబు చేతుల మీదుగా క్రియా శీలక సభ్యత్వ ఇన్సూరెన్స్ చెక్కులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని భువనగిరి పల్లికు చెందిన కోలాటం నరసింహ, అతని సతీమణి సుజాత రోడ్డు ప్రమా దంలో మృతి చెందడంతో రూ.10 లక్షల బీమా చెక్కును అందించి నట్లుతెలిపారు. కార్యక్ర మంలో అతికారి దినేష్, కె.ఎస్ నరసింహ, హరి పాల్గొన్నారు.

రాజంపేట : బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న నాగబాబు

LOSS OF PASSPORT

I, **GADDAM VISWANATH** S/o GADDAM RAMANA, residing at Door No.1-21, T.Sakirevupalli Village and Post, Valmikipuram Mandal, Annamayya District, A.P. I lost my Original Passports Bearing No's: **X1062436 & S7937140** on 06.08.2025 while travelling from T.Sakirevupalli to Valmikipuram by bus. If any one found please contact at 9136522895.

రైతుల సంక్షేమం కోసమే రైతన్నా..మీకోసం :'చమర్తి'



రాజంపేటలో రైతులతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట

కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని రాజంపేట నియోజకవర్గ టిటిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ యోజనతో రైతులకు అండగా నిలుస్తోందని, ప్రతి రైతుకు పెట్టుబడి సాయంతో పాటు మద్దతు ధర కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పట్టిష్ట చర్యలు చేపట్టాలని, ప్రతి ఎకరాకు నీరు అందించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. మండల పరిధిలోని వరదయ్యగారి పల్లె గ్రామం నందు పర్యటిస్తూ రైతన్నా..మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపిమండల పార్టీ అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ మండల అధ్యక్షులు బాపనయ్య నాయుడు, కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, మండల క్లస్టర్ ఇంచార్జ్ సతీష్ చౌదరి, కెసి చౌదరి, ఎంపిటిసి నాగార్జున, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** రైతుల అభివృద్ధి కోసం రాష్ట్రం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను తయారు చేసిందని మార్కెట్ కమిటీ ఛైర్మెన్ కోసూరి చంద్రమౌళి, ఎంపిడిఒ మనోహరరాజు, వ్యవసాయ శాఖ ఎఒ మురళీ మోహన్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో రైతన్న మీకోసం కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మనోహర రాజు మాట్లాడుతూ ప్రతి రైతు ఇంటికి ఒక టీంను ఏర్పాటు చేసి డోర్‌టూడోర్ సర్వే చేసి ప్రతి రైతు కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న లబ్ధి, వ్యవసాయం లాభసాటిగా చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. రైతులు మరింత అభివృద్ధి చెందేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఈ నెల 29వ తేది వరకు రైతుల ఇంటి వద్దకు వెళ్లి అవగాహనలు కల్పించాలన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ ఛైర్మెన్ కోసూరి చంద్రమౌళి మాట్లాడుతూ రైతు అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలైన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల ప్రోత్సాహం, రైతులకు అందిస్తున్న ప్రయోజనాలకు వివరించాలన్నారు. రైతులు కొత్త అవకాశాలను సద్వినియోగం చేసుకొని, ఆధునిక వ్యవసాయ పద్ధతులతో తమ కుటుంబాల ఆర్థిక స్థితని మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **రామాపురం :** రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రైతన్నా..మీ కోసం కార్యక్రమాన్ని చేపట్టిందని లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మద్దిలేవుల రమేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామంలో రైతుల ఇంటి వద్దకు వెళ్లి అన్నదాతలతో మమేకమై ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం సబ్సిడీ అభివృద్ధి తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అయోధ్య పురం పట్టాభిరెడ్డి, గంప సుబ్బరాయుడు, శ్రీనివాసులు, వెంకట సుబ్బయ్య, సూరం శివారెడ్డి, రామాంజనేయులు, టిడిపి మండల కమిటీ నాయకులు క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌ఛార్జి, రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు. **రాయచోటి అర్బన్:** సిఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతన్నలకు పెద్దపీట వేసిందని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన సోమవారం శిబ్యాల గ్రామంలో రైతన్న మీకోసం ఈ కార్యాచరణ గురించి అన్నదాతలకు వివరిం చారు. అన్నదాత సుఖీభవ, పథకంలో ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చేత ప్రతి యేడాది రైతులకు రూ.20వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. 90శాతం సబ్సిడీతో బిందు సేద్య పథకం పరికరాలు, సబ్సిడీ పైన మేలైన విత్తనాలు రైతాంగానికి అందజేయడం జరుగుతుందన్నారు. ఉల్లి, మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే ప్రయత్నం చేస్తు న్నారన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ, సంచార రైతు బజార్లు, పంట సాగులో శాటి లైట్ టెక్ సహాయం, వ్యవసాయ యాంత్రి కరణ తదితర పథకాలతో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు పాల్గొన్నారు.

రాయచోటి: కరపత్రాలు పంచుతున్న రాంప్రసాద్‌రెడ్డి

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా జెఎసి అధ్యక్షులు సి మురళీమోహన్‌రాజు అన్నారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమస్య ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే వారి సమస్యను పరిష్కరించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు దాటినా కూడా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా తక్కువ జీతాలతో సరైన హెచ్‌ఆర్ విధానం లేకుండా అనేకమంది ఉద్యోగులు కష్టాల్లో ఉన్నారని తెలిపారు. మినిమం టైం స్కేల్ అమలు చేసి సరైన సమయానికి జీతాలు ఇవ్వాలన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ విరమణ 62 ఏళ్లకు పెంచాలని, ఇపిఎఫ్, గాడ్యూటీ, పెన్షన్ ప్రయోజనాలు అమలు చేసి ఆరోగ్య భీమా మెడికల్ సదుపాయాలు కల్పించాలన్నారు. ఖాళీ పోస్టుల భర్తీ అంశాలు వెంటనే అమలు చేయాలని కోరారు. టీచర్స్ డీఎస్సీ మరియు ప్రభుత్వ రెగ్యులర్ పోస్టులకు నోటిఫికేషన్ సమగ్ర శిక్ష ఉద్యోగులకు తగిన సర్వీస్ వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. సమస్య పరిష్కారం కోసం పదవ తేదీ చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి యుఎస్ జిల్లా కార్యదర్శి ఆర్ రామాంజనేయులు, మునిరెడ్డి, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, మండల అధ్యక్షులు అజీజూర్ రెహమాన్, జిల్లా జెఎసి కార్యదర్శి అలీ హుస్సేన్, జిల్లా జాయింట్ సెక్రటరీ వెంకటరమణ, ట్రెజరర్ నరసింహులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి సేవా భావాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-వీరపల్లి

ప్రతి విద్యార్థి సేవభావాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ జూని యర్ కళాశాల ప్రిన్సిపల్ ఆజంపుతుల్లా, ఎన్ఎస్ఎస్ అధికారులు రఘురా మయ్య, భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం స్పెషల్ క్యాంపులో భాగంగా మొదటి రోజు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ సమా జం పట్ల బాధ్యతతో మెలగాలని స్వచ్ఛందంగా సేవ చేయడానికి ముందుకు రావాలని వాలంటీర్లకు పిలుపునిచ్చారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి రఘురామయ్య మాట్లాడుతూ ఇలాంటి స్పెషల్ క్యాంపుల ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, కలిసిమెలిసి జీవించడం, కలిసి చర్చించుకోవడం నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం సేవా భావాన్ని అలవర్చుకోవడం ఏర్పడతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఇలాంటి కార్యక్రమాలలో విరివిగా పాల్గొని సమాజానికి సేవ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మరో ప్రోగ్రాం ఆఫీసర్ సి.భాస్కర్ అధ్యాపకులు శ్యాంసుందర్‌రెడ్డి, చంద్రశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అజంపుతుల్లా

కొలువుదీరిన ఆలయ పాలకమండలి

- ఛైర్మన్‌గా నవీన్‌కుమార్ చౌదరి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ పాలక మండలి సోమవారం కొలువుదీరింది. ఆలయ పాలక మండలి చైర్మన్‌గా నవీన్ కుమార్ చౌదరి, డైరెక్టర్లుగా పాలకమండలి సభ్యులు దుబ్బిగాళ్ల భాస్కర్, అజయ్ పండిట్, కె.మల్లిక, కాశీ శ్రీరామ్ వాల్మీకి, మంజునాథ్, మారుతి, ఎస్.నాగమణి, కందూరి రాజేష్, బుజ్జమ్మ, యం.ఉష ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున కూటమి పార్టీల నాయకులు, కార్య కర్తలు, అభిమానులు,పాలక మండలి చైర్మన్, డైరెక్టర్లు వారి కుటుంబ సభ్యులు బంధు మిత్రుల రాకతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్, డైరెక్టర్లను పెద్దఎత్తున శాలువలు, పుష్పగుచ్చాలు, పూల మాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ పాలక మండలి భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, ప్రజలకు ప్రశాంత వాతావరణంలో దర్శన భాగ్యం కలిగించే ఏర్పాటు చేయడంతో పాటు అభివృద్ధికి పునరం కితం కావా లని తెలిపారు. ఆలయంలో కళ్యాణ మండ పాన్ని పూర్తి చేయడానికి వీలుగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డితో మాట్లాడి రూ. 50 లక్షల నుంచి కోటి రూపాయలు నిధులు మంజూరయ్యే విధంగా చర్యలు తీసు కుంటామని ప్రకటించారు .చైర్మన్ నవీన్ చౌదరి మాట్లాడుతూ తనకు కలియుగ ఆరాధ్య దైవం వెంకటేశ్వర స్వామికి సేవ చేసుకునే అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకి రుణపడి ఉంటానని తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా, సభ్యులు, దాతలు, పూర్వ ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డెప్ప రావుల సహకారంతో కల్యాణ మండపం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాయలసీమ రీజనల్ కో-ఆర్డినేటర్ దారం అనిత, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చిన బాబు, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దొరస్వామి నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మధుబాబు, 20వ వార్డు కౌన్సిలర్ పచ్చిపాల తులసి, బొమ్మిశెట్టి పురుషోత్తం, జనసేన శ్రీరామ రామాంజనేయులు, జంగాల వెంకటరమణరెడ్డి షంషీర్, బాబు, దేవాదాయ శాఖ పాల్గొన్నారు.



పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండల కేంద్రం గుర్రంకొండ జడ్‌పి హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ సహకారంతో సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు రత్న శేఖర్ విద్యార్థులకు సిపిఆర్‌పై ప్రథమ చికిత్స వంటి విషయాలపై క్లుప్తంగా వివరిం చారు. గుండె ఆగిన సమయంలో సిపిఆర్ చేయడం వలన ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరు సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లా డుతూ ఎంతోమంది సిపిఆర్ పై అవగాహన లేక ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో సిపిఆర్ అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో జడ్‌పి హై స్కూల్ హెచ్‌ఎం తకివుల్లా, ఉపాధ్యాయులు జావేద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కమలాకర్, ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ జమీర్,హెల్పింగ్ మైండ్స్ గుర్రంకొండ ఇన్‌ఛార్జిలు మొఖద్దర్,ఆబిద్, సునీల్, అబ్దుల్లా, నవీన్ పాల్గొన్నారు.

మండలాధ్యక్షుడిగా పురుషోత్తం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి మదనపల్లి మండలాధ్యక్షులుగా పురుషోత్తం ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు పొదల నరసింహులు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం స్థానిక బుగ్గకాలువలోని గంగమ్మ ఆలయంలో వాల్మీకి యువతతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పురుషోత్తంకు రాష్ట్ర అధికార ప్రతినిధి బొగ్గిటి కృష్ణమూర్తితో కలిసి ఆయన నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చుతామని హామీలు గుప్పించి అందలమెక్కిన తర్వాత విస్మరించడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీలో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచిన ఇప్పటి వరకు ఎస్‌టి జాబితా గురించి మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకులకు అండగా నిలిచి ఎస్‌టి జాబితాలో చేర్చుతా మని హామీలు ఇవ్వడం మినహా ఏమి చేయలేదన్నారు.పోరాటం తప్ప మరోమార్గం లేదని స్పష్టం చేశారు. యువత ముందుకు వచ్చి ఎస్‌టి జాబితా పునరుద్ధరణలో క్రియా శీలక పాత్ర పోషించాలన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి తోపాటు చదువుకోవడానికి ఫీజు రియంబర్స్ మెంట్ మంజూరు చేయడంలోను వివక్ష జరుగుతోందని మండిపడ్డారు. ఎస్టీ జాబితాలో చేర్చితేనే సమస్యకు పరిష్కారం, యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో విఆర్ఎస్ఎస్ సభ్యులు చెన్నం శ్రీరాములు, బొగ్గిటి గంగాధర్, జయచంద్ర, నరసింహులు,సందీప్, జయవర్ధన్, చరణ్, ప్రవీణ్ కుమార్, భాను ప్రకాష్, దిలీప్, రవి, గిరిబాబు పాల్గొన్నారు.

సయ్యద్ రియాజ్ బుఖారికి బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి-కలికిరి

మహల్‌కు చెందిన ప్రముఖ ఉర్దూ విద్వాంసుడు విద్వాంసుడు సుఫీ సయ్యద్ మెహమ్మద్ బుఖారి కుమారుడు డాక్టర్ సయ్యద్ రియాజ్‌బుఖారికి ఎపి ఉర్దూ అకాడమీ తరపున ప్రతిష్ఠాత్మక 'బెస్ట్ అచీవ్‌మెంట్' అవార్డు ప్రదానం చేయబడింది. విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును సిఎం చంద్రబాబు, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి.ఫరూఖ్ సమక్షంలో అందుకున్నట్లు తెలిపారు. ఎంఎ, బి.ఎడ్., పిహెచ్‌డి పట్టాలు ఉన్నాయని, ఖాన్వాదే షా మీరియా కి అదబీ ఖిద్మత్ అనే విషయంపై పరిశోధన చేసి, 2014లో తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి పొందినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ నుంచి బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ గౌరవాన్ని అందించిన సిఎం చంద్రబాబు, మంత్రి ఫరూఖ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఉర్దూ వారసత్వ పరిరక్షణే తన ధ్యేయని, ఈ అవార్డును నా తల్లిదండ్రులు, గురువులు, విద్యార్థులు, నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ అంకితం చేస్తున్నానని చెప్పారు. భవిష్యత్ తరాల కోసం ఉర్దూ భాష అభివృద్ధి దిశగా మరింత కృషి చేయడానికి ఈ గౌరవం నన్ను ప్రేరేపిస్తోందని తెలిపారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో 'రవిచంద్ర' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-గాలివీడు

చంద్రగిరిలో రెండు రోజులుగా జరుగుతున్న అండర్-14 విభాగం రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో రవిచంద్ర పాఠశాల 9వ తరగతి విద్యార్థిని తహసీన్ ప్రతిభా ప్రదర్శనతో మెరిసిం దని యాజమాన్యం షింటో ఇమ్మాన్యుయేల్, సైజు థామస్ వెల్లడించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కడప హాకీ జట్టు తరపున ఆడిన తహసీన్ అద్భుతమైన ఆట తీరుతో సెలెక్షన్ కమిటీని ఆకట్టుకున్నారని తెలిపారు .అనంతరం ఉపాధ్యాయులు,సిబ్బంది తహసీన్‌ను, వ్యాయమ ఉపాధ్యా యురాలు పద్మను అభినందించారు. భవిష్యత్తులో మెరుగైన ప్రదర్శన చూపి జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

గిరిజనులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సివిల్ సర్వీసెస్ పిలిమినరీ, పరీక్షలు, 2026కు సంబంధించి ఉచిత శిక్షణకు డిగ్రీ పూర్తి చేసి గిరిజన అభ్యర్థులు తమ బయో డేటాతో పాటు రెండు ఫొటోలు, విద్యా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాన్ కార్డ్, తదితర జిరాక్స్ కాపీలను జతపరిచి ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి. తేజస్విని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులకు విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలో శిక్షణ కేంద్రాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. 26న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 27వ తేదీ నుంచి హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 30వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి, స్క్రీనింగ్ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు డిసెంబర్, 10వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమ వుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వాతంత్ర్య సమర యోధుడు 'ఉయ్యాలవాడ'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంగ్లేయుల వెన్నుల్లో వణుకు పుట్టించిన స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాల వాడ నరసింహారెడ్డి అని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుడిబమడ రవికుమార్ రెడ్డి అన్నారు. స్థానిక రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెడ్డి సంక్షేమ కార్యాలయంలో ఉయ్యాలవాడ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అధ్యక్ష, కార్యదర్శులు గుడిబండ రవి కుమార్ రెడ్డి, వి.సాంబ శివారెడ్డిలు మాట్లాడుతూ బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్లుపరిగెత్తించిన అత్యంత ధైర్యవంతుడు, భారత దేశ స్వాంతంత్ర్యం కోసం తిరుగుబాటు చేసి అలుపెరుగ పోరుబాట కొనసాగించిన పరాక్రమవంతుడన్నారు. తన ధైర్యసాహసాలతో ఆంగ్లేయుల వెన్నుల్లో వణుకు పుట్టించారని,స్వాతంత్రోద్యమానికి ఊపిరి పోశారని కొనియాడారు. ఆయనను ఎదుర్కొనే ధైర్యం లేక కుట్రలు పన్ని బంధించి ఉరికంభం ఎక్కించి నప్పటికీ ఆ ఉరికంబాన్ని సైతం సగర్వంగా తన మెడకు బిగించుకొని వీరమరణం పొంది చరిత్రపుటల్లోకి చిరస్మరణీయంగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గిరిధర్ రెడ్డి, కే.సుధాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన 'విజయభారతి' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కరాటేలో విజయభారతి పాఠశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ప్రతిభతో పాటు పతకాలు సాధించినప్పుడే కరాటే విద్యార్థులకు తగిన గుర్తింపు వస్తుందని విజయభారతి స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.సేతు పేర్కొన్నారు. బెంగుళూరులో జరిగిన ఒకినవా గోజు రియు కరాటే డూ ఫెడరేషన్ మలేషియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఎస్‌కె గోజు రియు, కరాటే డో ఇండియా వ్యవస్థాపకులు క్యోషి యమ్ కన్నన్ పాల్గొన్నారు. పట్టణంలోని విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ యం.మణిసాయి మాట్లాడుతూ ఛాంపియన్షిప్ నందు 13 సంవత్సరాల సీనియర్ బాయ్స్ కటా విభాగంలో కె.చరణ్ తేజ, సి.గౌతమ్ నంద, వై.గీర్వన్, అర్.ధనుష్ రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. 12 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో యమ్.కార్తికేయ ప్రథమ స్థానం,10 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో కే.యస్వంత్ తేజ్ ప్రథమ స్థానం,13 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో యస్.మహేశ్వర్ ప్రథమ స్థానం, 12 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో యమ్.కార్తికేయ ప్రథమ స్థానం, 12 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో వి.రేవంత్ ద్వితీయ స్థానం, 12 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో పి.చందన్ ద్వితీయ స్థానం సాధించారన్నారు. 12 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో ఏ.గగన్ ద్వితీయ స్థానం, 12 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో పి.హేమంత్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు చెప్పారు. 11 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో ఏ.హరీష్ రెడ్డి ద్వితీయ స్థానం,12 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో యమ్.రిషికేష్ గౌడ్ తృతీయ స్థానం,13 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో జి. ప్రేమ్ సందీప్ తృతీయ స్థానం,11 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో ఏ.జఫ్ఫార్ తృతీయ స్థానం,12 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో జె. రోహిత్ తృతీయ స్థానం, 13 సంవత్సరాల బాయ్స్ కటా విభాగంలో వరుణ్ తెజ్ తృతీయ స్థానం అందుకున్నారన్నారు. విద్యార్థులకు యస్.యస్.కే గోజు రియు కరాటే డో ఇండియా వ్యవస్థాపకులు క్యోషి కన్నన్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించినట్లు తెలిపారు.

నలుగురు చైన్ స్నాచర్లు అరెస్టు

-15 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం : ఎఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని ఎఎస్‌పి ఎం.వెంకటాద్రి హెచ్చరించారు. సోమవారం ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడి చేస్తూ, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నలుగురు నిందితులను కె.వి పల్లి మండలం తిమ్మాపురం క్రాస్ వద్ద రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్, కలకడ సిఐ లక్ష్మన్న, కె.వి పల్లి ఎస్ఐ చిన్నారెడ్డప్ప పోలీసుల బృందం పక్కా సమాచారంతో అరెస్టు చేశారని తెలిపారు. ఈ నలుగురు నిందితులు సంబేపల్లి, కలకడ, కలికిరి, పీలేరు, గుర్రంకొండ, కె.వి పల్లి పరిసర ప్రాంతాలలో ఒంటరిగా వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతూ ఉండేవారని పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీ రాత్రి సమయంలో ఓ బట్టల వ్యాపారిని వెంబడించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బెదిరించి దోపిడీకి పాల్పడ్డారని తెలిపారు. నిందితుల నుంచి ఆరు బంగారు చైన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు,4 సెల్ ఫోన్లు, 15 చీరలు స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో నేరాలకు పాల్పడే వారిని ఎలాంటి పరిస్థితుల్లో ఉపేక్షించమని ఇలాంటి వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు లేదా సమీప పోలీసు స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి అభినందించి బహుమతితో ప్రోత్సహించారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎఎస్‌పి వెంకటాద్రి